షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 334 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 16 డిసెంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 333 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 21 October 2024 PAGES : 8 PRICE : 5/-

# సంక్రాంతికి పక్కా?



- తాజాగా ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ విస్తరణ కోసం అనుమతి తీసుకున్నారు.
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచింది. కేబినెట్ 12 మందితో ఏర్పడింది.
- ఆరు పోస్టులు ఇంకా ఖాళీగా ఉన్నాయి. తాజాగా వాటి భర్తీకి లైన్ క్లియర్ అయింది.
- సామాజిక సమీకరణలకు కేబినెట్‌ల్‌లో ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది

హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచింది. కేబినెట్ 12 మందితో ఏర్పడింది. ఆరు పోస్టులు ఇంకా ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా వాటి భర్తీకి లైన్ క్లియర్ అయింది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. ఈ నేపథ్యంలో క్యాబినెట్ బెర్తుల ఖాళీలు భర్తీ చేసేందుకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కసరత్తు మొదైలంది. కాంగ్రెస్ మార్కు రాజకీయాలు రాష్ట్రంలో ఊపందుకున్నాయి. తాజాగా ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ విస్తరణ కోసం అనుమతి తీసుకున్నారు. ఆరుగురి పేర్లు ఖరారు చేసుకుని వస్తారని తెలుస్తోంది. దీంతో ఆశావహులు అలర్ట్ అయ్యారు. మరోవైపు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కూడా మరో జాబితాతో ఢిల్లీ వెళ్లారు. ఆయన ప్రధానంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతోపాటు మరికొంత మంది కోసం లాబీయింగ్ చేస్తున్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా భట్టిని కలిశారు. తన పేరు సిఫారసు చేయాలని కోరారని సమాచారం.ఇదిల ఉంటే.. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఢిల్లీలో రచ్చ చేశారు. పార్టీలో పాత వారికన్నా కొత్తవారికి ప్రాధాన్యం ఇస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస మున్షికి - మిగతా3లో



## రీజనల్ రింగ్ రోడ్డుకు మహర్దశ

రీజనల్ రింగు రోడ్డు సూపర్ గేమ్ ఛేంజర్

ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సగం తెలంగాణ అభివృద్ధి

ఇప్పటికే ఉత్తర భాగం భూసేకరణ దాదాపు పూర్తయింది

తెలంగాణ మణిహారంగా చేపడుతున్న రీజనల్ రింగు రోడ్డుపై కీలక అప్డేట్ వచ్చింది.

హైదరాబాద్

తెలంగాణ అభివృద్ధిలో హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు సూపర్ గేమ్ ఛేంజర్ అని ప్రభుత్వ పెద్దలు వెల్లడిస్తున్నారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సగం తెలంగాణ అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు నుంచి సుమారు 40 కి.మీ దూరం నుంచి ఈ ప్రాజెక్టును ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఉత్తర, దక్షిణ భాగాలుగా ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఉత్తర భాగం భూసేకరణ దాదాపు పూర్తయింది.తెలంగాణ మణిహారంగా చేపడుతున్న రీజినల్ రింగు రోడ్డుపై కీలక అప్డేట్ వచ్చింది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి (159 కి.మీ.) అవసరమైన సాంకేతిక, ఆర్థికపరమైన అనుమతులు వెంటనే ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఢిల్లీ పర్యటనలో - మిగతా3లో



## 'మహా' మంత్రివర్గ విస్తరణ

- 37 మంది ప్రమాణస్వీకారం
- ఫడ్నవీస్ క్యాబినెట్‌లోకి ధనుంజయ్ ముండే.. పంకజ్ ముండే..
- మంత్రులుగా సరిగ్గా పని చేయని వారిని ఏక్ నాథ్ షిండే గ్రూప్ నుంచి నలుగురు, బీజేపీ నుంచి ముగ్గురు, అజిత్ పవార్ గ్రూప్ నుంచి ఇద్దరిని తప్పిస్తారని సమాచారం
- మహారాష్ట్ర క్యాబినెట్ విస్తరణపై ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో చర్చించారని సమాచారం


# అరాచక పాలన మరువం

- కేసీఆర్‌కు మహేశ్ కుమార్ గౌడ్ కీలక లేఖ
- ఏడాది కాలంలోని కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల వివరాలతో లేఖ
- రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందెవరు? అంటూ ప్రశ్నల వర్షం
- సెంటిమెంట్ పేరుతో రెండుసార్లు అధికారంలోకి వచ్చి మీరు గడీల పాలనతో ప్రజలకు కన్నీరు మిగిల్చారు.
- నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో ఉద్యమించి.. పీఠమెక్కాక మాయమాటలతో పాలించారు




హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు నిరంతరం బురద జల్లుతూ ప్రజలను తప్పుదారి పట్టించడం మానుకోవాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ బహిరంగ లేఖ రాశారు. ఆరు పేజీల బహిరంగ లేఖలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు పోరాటం చేసిందెవరు? దాని ఫలితం అనుభవించిందెవరు? మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని ఇస్తే అప్పుల పాలు చేసిందెవరు? అంటూ సవాలక్ష ప్రశ్నలతో బహిరంగ లేఖను పంపారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఆ లేఖలో వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలపై స్పష్టత ఇచ్చే దిశలో తాను ఈ లేఖ రాస్తున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనతోనే తెలంగాణ వెనకబాటుకు గురైందని ఆరోపించారు. సెంటిమెంట్ పేరుతో రెండుసార్లు ముఖ్యమంత్రి కుర్చీలోకి వచ్చిన కేసీఆర్, గడీల పాలన చేసి ప్రజలకు కన్నీరు మిగిల్చారని విమర్శించారు. రాష్ట్రానికి గుండెకాయలాంటి సచివాలయానికి - మిగతా3లో



## జమిలి ఎన్నికల బిల్లుపై వెనక్కి తగ్గిన కేంద్రం

- ఒకే దేశం - ఎన్నిక బిల్లుపై కేంద్రం పునరాలోచన..?
- రేపు పార్లమెంట్‌లో బిల్లు పెట్టేది అనుమానమే..!
- తాజాగా సవరించిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో సోమవారం నాటి ఎజెండాలో ఈ రెండు బిల్లులను తొలగించింది
- పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 20న ముగియనున్నారు.
- రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు- 2024, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ బిల్లు), 2024కి ఆమోద ముద్ర వేసింది.



## ఈవీఎంలపై విశ్వాసం లేకుంటే...

- ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు
- గెలిచినప్పుడు ఎన్నికల ఫలితాలను అంగీకరించినప్పుడు, ఓడిపోయినప్పుడు ఈవీఎంలను తప్పుపట్టరాదు
- ఓటింగ్ మిషన్లను విశ్వసించనప్పుడు ఎన్నికల్లో పోటీకి పార్టీలు దూరంగా ఉండాలి
- సిద్ధాంతాల పరంగానే కానీ పక్షపాతంతో తాను మాట్లాడటం లేదు
- సెంట్రల్ విస్టా వంటి మౌలిక వసతుల ప్రాజెక్టుకు తాను సపోర్ట్ చేశా



## కట్లకుంటలో దారుణం

### వ్యవసాయ బావిలో నవజాత మగ శిశువు మృతదేహం



షణ్ముఖ వెలుగు మేడిపల్లి ప్రతినిధి డిసెంబరు 15 : జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలో నవజాత మగ శిశువు మృతదేహం ఉండటంతో గ్రామస్థులు మేడిపల్లి పోలీసులకు సమాచారం అందించారు మేడిపల్లి పోలీసులు నవజాత శిశువు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

## అధికార పార్టీ నాయకులతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్లెక్సీలల్లో డాబు దర్పం

షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి డిసెంబరు 15

మెట్ పల్లి పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఇన్ గేట్ ఎదురుగా, పోలీస్ స్టేషన్ ఎదురుగా, డి ఈ ఈ కార్యాలయం పక్కన ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు బహిరంగంగానే అధికార పార్టీ నాయకులతో కలసి ప్లెక్సీలను ప్రదర్శించి తోటి ప్రభుత్వ ఉద్యోగులను, మండల,జిల్లా అధికారులను కూడా ఔరా అనే విధంగా అధికార దర్పాన్ని ప్రదర్శించడం అధికారులు చూసీ చూడనట్లు చూస్తున్నారు. పట్టణంలోని ఉపాధ్యాయులు, ప్రజలు సైతం నిర్ఘాంతపోయి చూస్తున్నారు. అధికార పార్టీ కార్యక్రమాల్లో ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇంతలా ఒక పార్టీ నాయకుడి లాగా ప్లెక్సీలు పెట్టడం దానిని మండల, జిల్లా విద్యాధికారులు సైతం సదరు ఉపాధ్యాయుని గురుంచి ఏదైనా చర్యలు తీసుకోవాలంటే అధికార పార్టీ అని వణికిపోతున్నారు. గతంలో సైతం మెట్ పల్లి లో విధులు నిర్వహించినప్పుడు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఐదు సంవత్సరాల క్రితం అతను సస్పెండ్ అయిన కాలం లీవ్ సెటిల్ మెంట్ కాక ముందే ఒక ఇంక్రిమెంట్ ఇచ్చి అతన్ని ప్రసన్నం చేసుకున్నట్టు ఉపాధ్యాయ వర్గం చెప్పుకుంటున్నారు. గతంలో ఉపాధ్యాయుల వద్ద చిట్టీల వ్యాపారం చేసి కొద్ది మంది ఉపాధ్యాయులకు చిట్టి పూర్తి అయినప్పటి నుండి ఇప్పటి వరకు కూడా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం,




అమాయక ఉపాధ్యాయులను ఎంచుకుని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేసి అడిగితె బెదిరించడం లాంటివి అనేకం అని పై కారణాల దృష్ట్యా అయన గురించి మాట్లాడటం భయం భయంగా ఉన్నారని తోటి ఉపాధ్యాయులు అతని గురించి తెలిసినవారు మాట్లాడుకుంటున్నారు

# ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, మాదిగల సమగ్ర అభివృద్ధి రౌండ్ టేబుల్ సమావేశం





**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ రూరల్ ప్రతినిధి డిసెంబర్ 15:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ మాదిగల సమగ్ర అభివృద్ధి కోసం మాదిగల తక్షణ కర్తవ్యం అనే అంశం పైన మాదిగల ఐక్య వేదిక ద్వారా మధువని గార్డెన్స్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు మాదిగ జాతి కి ఏం కావాలో ఏం అన్యాయం జరుగుతుందో అని మాదిగ జాతి సోదరులు విశ్లేషణ చేసుకోవడం జరిగిందని ఈ సభ ద్వారా అందాల్సిన రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలని అందరూ ఆకాంక్షించారు రౌండ్ టేబుల్ సమావేశం ద్వారా మూడు ముఖ్యమైన తీర్మానాలు చేశారు

(1) కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు వివేక్,కెఆర్ నాగరాజు మరియు రెంజర్ల రాజేష్ లను దళిత సమాజం మరియు మాదిగ సమాజం నుండి బహిష్కరణ

(2)మాలలు ఎస్సి రిజర్వేషన్ పై వైఖరి మార్చుకోకుంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మాదిగలను ఓట్లు అడగకూడదు మిమ్మల్ని మా మాదిగలు ఓట్లు అడగరు

(3) మాదిగలు ఏ పార్టీ లో ఉన్న పార్టీలకు అతీతంగా గెలిపించాలి..

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ సభ నిర్వాహకులు తిప్పారపు సంపత్ సభ అధ్యక్షులు రుద్రారపు రాంచందర్ మారంపెల్లి శ్రీనివాస్ మాదిగ మహిళా విభాగం సోదరి ఆకినపెల్లి శిరిష మిడి దొడ్డి శ్రీనివాస్ కొండ్ర నరేష్ మొలుగూరి పూర్ణ చందర్ పర్లపెల్లి రమేష్ మిడి దొడ్డి రాజు ఎర్ర రవీందర్ ఎర్ర రమేశ్ బోరగాల రాజయ్య సతీష్ మోరె మధు టేకుల శ్రావణ్ కొలుగూరి కిరణ్ మోలుగూరి ప్రభాకర్ వేల్పుల రత్నం బొడ్డు సంజీవ్ వేల్పుల విజయ్ ఎర్ర నాగరాజు అడ్వకేట్ మొలుగూరి సదయ్య తునికి సమ్మయ్య మిడిదోడ్డి స్వామి మునిగాల మధు మేకల రవీందర్ రవి తేజ ఎర్ర శ్రీధర్ ఆరపెల్లి ఎల్లయ్య లంక దాసరి కళ్యాణ్ శనిగారపు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన చిన్న పడిశాల కాంగ్రెస్ నాయకులు

**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి డిసెంబరు 15:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డ గూడూరు మండల పరిధిలోని చిన్న పడిశాల గ్రామానికి చెందిన గొర్ల లింగయ్య ఇటీవల మృతి చెందాడు . చిన్న పడిశాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి పది వేల రూపాయలు 10,000/- ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం చిన్న పడిశాల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో గత కొద్ది రోజుల క్రితం మాజీ సర్పంచ్ యేసు రత్నం సస్పెండ్ విషయంలో చిన్న పడిశాల గ్రామానికి చెందిన 50 కుటుంబాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ యేసు రత్నం సస్పెండ్ ను రద్దు చేసినా చేయక పోయినా కాంగ్రెస్ పార్టీలో నే ఉంటూ వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చినా ఇవ్వక పోయినా స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తామన్నారు ఎస్సీ అభ్యర్థిగా చుక్క నర్సయ్య ను, బీసీ అభ్యర్థిగా ఓర్సు నవీన్ ను, జనరల్ అభ్యర్థిగా ముసుకు బిక్షం రెడ్డిని బరిలోకి దింపుతామని అన్నారు .50 కుటుంబాల కాంగ్రెస్ నాయకులు ఒకే తాటిపై ఉండి సర్పంచ్ అభ్యర్థిని





గెలిపించు కుంటామని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సైదులు, మాజీ ఉపసర్పంచ్ సికిందర్ రెడ్డి, మాజీ డైరెక్టర్ యాదవరెడ్డి, తుని కేసి చిన్న ఉపేందర్ రెడ్డి, తుని కేసి సోమిరెడ్డి,కాపూరు చంద్రయ్య,కొప్పుల చంద్ర రెడ్డి, సూడిద చిన్న గట్టయ్య, సూడిద పెద్ద గట్టయ్య సూడిద లింగయ్య, అల్లె సుధాకర్, అల్లె బిక్షమయ్య, సుక్క యాదగిరి, సుక్క ఇస్తారి,మారోజు బ్రహ్మాచారి,కాటి చంద్రయ్య, రూపని నర్సయ్య, ఇద్దయ్య, ననుబోతు నాగరాజు, ననుబోతు భిక్షమయ్య, లింగయ్య,యాదగిరి, రామ నరసయ్య, సోమ నర్సయ్య కిష్టయ్య, బుచ్చయ్య, సుధాకర్, రాజారాం, పాపయ్య, యాదగిరి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## హుజురాబాద్ లో తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సమావేశం



**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ రూరల్ ప్రతినిధి డిసెంబరు 15:** తెలంగాణ ఆర్టీసీ రిటైర్డు కార్మికులు హుజురాబాద్ గవర్నమెంట్ హైస్కూల్ గ్రౌండ్ లో సంఘం అధ్యక్షులు ఆర్.చారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో రిటైర్డు కార్మికులకు ఆర్టీసీ మేనేజ్మెంట్ చేస్తున్న నష్టాలను ఆఫీసుల్లో జరుగుతున్న అవకతవకలను కార్మికులు వివరించారు అయ్యర్ పించన్ ఇంకా అమలు కావడం లేదని కార్మికులు ఆందోళన చెందుతున్నారని అయ్యర్ పించన్ అధికారులు పట్టించుకోవడంలేదని రిటైర్డ్ కార్మికులకు అందాల్సిన బెనిఫిట్స్ అమలు కావడం లేదని రిటైర్మెంట్ కార్మికులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయాలని మేనేజింగ్ డైరెక్టర్ ఎండి లను డిమాండ్ చేశారు వృద్ధులకు రిటైర్మెంట్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్ ముఖ్య సలహాదారు టీ. కనకయ్య ట్రెజరర్ పాండారి మార్త రవీందర్ వేల్పుల ప్రభాకర్ ఇవి ఆర్ నరసయ్య ప్రభాకర్ రెడ్డి మొగులయ్య వై కే స్వామి ఆర్ఆర్ పతి మండల కనకయ్య రిటైర్డ్ కార్మికులు పాల్గొన్నారు

## రాష్ట్ర స్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో మెట్ పల్లి చిన్నారులు





**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి డిసెంబరు 15:** తెలంగాణ రాష్ట్ర స్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని చిన్నారులు అంకతి విశ్వంభర,శ్రీ గాయత్రి హర్షాలి,అక్షిత, రిత్విక, వైజ్ఞానిక, నిత్య శ్రీ, శ్రీ కృతి, సుధీక్ష లు ప్రతిభ కనబరిచారు. హైదరాబాదు లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో గల ఎన్టీఆర్ కళా మందిరంలో ఆదివారం ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో శివాని ఆర్ట్స్ అసోసియేషన్ 15 వ వార్షికోత్సవం సందర్భంగా తెలుగు నృత్య పద్య కవిత పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మీనాక్షి నృత్య కళా నిలయం గురువు శ్రీవాణి ఆధ్వర్యంలో మెట్ పల్లి చిన్నారులు పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచిన చిన్నారులకు కార్యక్రమ నిర్వాహకులు శ్రీ పరమేశ్వర్ ప్రశంస పత్రాలు, మెమెంటో లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి




**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి డిసెంబర్ 15:** మెట్ పల్లి పట్టణంలోని వాసవి గార్డెన్ లో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు . ముఖ్య అతిథిగా పాల్గొన్న జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మైలారపు లింబాద్రి అమర జీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు .ఈ కార్యక్రమంలో మెట్ పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు కార్యదర్శి యెలిమి రవి సంయుక్త కార్యదర్శి కొత్త నవీన్ వాసవి దేవాలయం అధ్యక్షులు చాడ సురేష్ వాసవి గార్డెన్ అధ్యక్షులు కోట కిరణ్ వాసవి విద్యా కమిటీ అధ్యక్షులు పడిగెల శ్రీనివాస్ యువజన సంఘం అధ్యక్షులు చకినం కేదార్ నాథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లూరి నవీన్ కుమార్ జొన్న శ్రీనివాస్ పాంపట్టి అరుణ్ కట్కం శంకర్ తదితరులు పాల్గొన్నారు

## పట్టా భూమిలో అక్రమ షెడ్డు నిర్మాణం

మరో ఇంటి నంబర్ తో విద్యుత్తు కనెక్షన్ పొందిన వైనం

అక్రమ నిర్మాణానికి సహకరిస్తున్న విద్యుత్తు అధికారులు

హైకోర్టు స్టే ఆర్డర్ ను సైతం లెక్క చేయడం లేదు

భూ యజమాని విజ్ఞప్తులను సైతం పట్టించుకోని వైనం



**షణ్ముఖ వెలుగు జమ్మికుంట డిసెంబరు 15 :** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో గల సర్వే నంబర్ - 467 కోరపల్లి రోడ్ లో గల స్థలంలో గొట్టె ప్రేమావతి అనే మహిళకు అందులో రెండు గుంటల భూమి కలదు. ఈ భూమికి సంబంధించి అన్ని పత్రాలు ఉన్నాయి.. అయితే ఈ భూమిపై కన్నేసిన పల్లపు ఉమా, పల్లపు తిరుపతి, గుంచ్కరి ప్రకాష్, గుంచ్కరి పూజిత అనే వ్యక్తులు భూ యజమాని లేని సమయంలో ఆ స్థలంలో ఒక రేకుల షెడ్డు అర్ధరాత్రి పూట నిర్మాణం చేశారు. ఈ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు కానీ పత్రాలు కానీ లేవు, విషయం తెలుసుకున్న భూ యజమాని వారికి సంబంధించిన భూమి ఇతర వ్యక్తులకు అన్యాక్రాంతం అయిందని తమకు న్యాయం చేయాలని కోరుతూ సంబంధిత పోలీసు స్టేషన్ లో, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు .కానీ ఎలాంటి న్యాయం జరగకపోవడంతో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు దీనిపై విచారించిన న్యాయ స్థానం భూ యజమానికి స్టే ఆర్డర్ ఇవ్వడం జరిగినది. ఇది ఇలా ఉండగా విద్యుత్తు శాఖ అధికారులు అక్రమ నిర్మాణ షెడ్డు కు విద్యుత్తు మీటర్ బిగించారు ఆక్రమణ దారులు వేరే ఇంటి నెంబరును క్రోడీకరిస్తూ విద్యుత్తు కనెక్షన్ దరఖాస్తు చేసుకున్నారు, ఈ దరఖాస్తు ఆధారంగా విద్యుత్తు అధికారులు కనెక్షన్ జారీ చేశారు. దీని పైన మండల రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీ అధికారులు సమగ్ర విచారణ చేసి అట్టి నిర్మాణాన్ని తొలగించాలని భూమి యజమాని అధికారులను కోరుతున్నారు.

## 1983-84 పదవ తరగతి బాల్య మిత్రుల ఐదవ వార్షికోత్సవ సమ్మేళనం



**షణ్ముఖ వెలుగు జమ్మికుంట డిసెంబరు 15:** జమ్మికుంట జడ్పీ ఉన్నత పాఠశాల పదవ తరగతి 1983- 84 బ్యాచ్ బాల్య మిత్రుల వార్షిక సమ్మేళనాన్ని ఇల్లంతకుంట మండల కేంద్రంలో నిర్వహించారు. పదవ తరగతి చదువుకొని 40 సంవత్సరాలు అవుతున్న శుభ సందర్భంలో కలుసుకున్న బాల్య మిత్రులు ఆట పాటలతో గడిపారు. గత స్మృతులను గుర్తు చేసుకున్నారు.

ఐదు సంవత్సరాల్లో బాల్య మిత్రుల సేవా సమితి ఆధ్వర్యంలో కరోనా సమయంలో ఆహార పొట్లాలు పంపిణీ, ఇల్లంతకుంట రామాలయం బ్రహ్మోత్సవాలు సందర్భంగా భక్తులకు నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని,సామాజిక కార్యక్రమాలను మున్ముందు నిర్వహించేందుకు నిర్ణయించుకున్నామని బాల్య మిత్రుల సేవా సమితి సమావేశంలో నిర్ణయించారు.

సమ్మేళనంలో నూతన బాల్య మిత్రులు సేవాసమితి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు . కన్వీనర్ గా ముకిరాల సంపత్ రావు కో కన్వీనర్ గా మంద వెంకటరెడ్డి కోశాధికారిగా గుండా సురేందర్ ఆర్గనైజర్ గా బత్తిని సాంబయ్య , వట్టపల్లి ప్రకాష్ వాసుదేవ రెడ్డి గౌరవ సలహాదారులుగా గుడిమల్ల బలరాం సహాయ సలహాదారులుగా రావి కంటి అశోక్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కూన గోవర్ధన్ ను ఘనంగా సన్మానించిన బాదన కుర్తి గ్రామ విడిసి సభ్యులు

**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి డిసెంబరు 15 :**అదిలాబాద్ జిల్లా ఖానా పూర్ నియోజకవర్గం లోని బాదన కుర్తి గ్రామం లో దత్త పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ దేవాలయం లో దత్త పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ దత్త పౌర్ణమి వేడుకల్లో హాజరైన సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి చేపట్టిన కూన గోవర్ధన్ ను బాదన కుర్తి గ్రామ విడిసి సభ్యులు దత్తాత్రేయ ఆలయం సభ్యులు ఘనంగా సన్మానించారు



## చైతన్య నగర్ వాడ కట్టు సంఘం అధ్యక్షుడిగా బండారి గోపి కృష్ణ



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి డిసెంబరు 15:** మెట్ పల్లి పట్టణంలోని ఆర్య వైశ్య సంఘం అనుబంధంగా ఉన్న వాడకట్టు సంఘాల్లో చైతన్య నగర్ 2 వాడ కట్టు రెండు సంవత్సరాలకు ఒకసారి అధ్యక్షున్ని ఎన్నుకోవడం జరుగుతుంది ఇందులో భాగంగా ఈసారి బండారి గోపికృష్ణ ను అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మైలారం లింబాద్రి మెట్ పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారం రాంబాబు చైతన్య నగర్ గౌరవ అధ్యక్షుడు వెలుగందుల తిరుపతి పాల్గొని ఎన్నికను నిర్వహించి బండారి గోపి కృష్ణను ఎన్నుకోవడం జరిగినది అనంతరం కొత్త అధ్యక్షుడిని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు మరియు స్నేహా లయ అధ్యక్షుడు కోట కిరణ్ తదితరులు అభినందించారు

## బి. గణేష్ వైద్యం కోసం ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే మెఘా రెడ్డి



**షణ్ముఖ వెలుగు పెబ్బేరు ప్రతినిధి డిసెంబరు 15:** పెబ్బేరు పట్టణ కేంద్రంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పట్టణ కేంద్రంలో లక్ష రూపాయల ఎల్ఓసి లెటర్ ను ఎమ్మెల్యే మేఘా రెడ్డి మెరుగైన వైద్య చికిత్స కోసం బాధిత బి గణేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. పెబ్బేరు మండలం రాంపురం గ్రామానికి చెందిన బి.గణేష్ మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు అయిన ఒక లక్ష రూపాయల ఎల్వోసి ని ఎమ్మెల్యే మేఘా రెడ్డి చేతుల మీదుగా ఆదివారం సాయంత్రం గ్రామస్థులచే కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## భగవద్గీత జ్ఞాన మందిరం లో ధనుర్మాస ఉత్సవాలు




**షణ్ముఖ వెలుగు జమ్మికుంట డిసెంబర్ 15 :** జమ్మికుంట పట్టణ కేంద్రంలో భగవద్గీత జ్ఞాన మందిరం గత 34 సంవత్సరాల నుండి ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు
ఈ సంవత్సరం ఈ రోజు నుండి జనవరి 14 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తారు
ఈ కార్యక్రమంలో భాగంగా ముక్కోటి ఏకాదశి రోజు స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం కుడారై పాయస నివేదన గోదార రంగ నాయకుల కళ్యాణం ప్రతి రోజు ఉదయం పాశురాలు కృష్ణా ష్టోత్తరం గోదాదేవి అష్టోత్తరము తదనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని పై కార్యక్రమాలన్నింటికీ ఆలయ కమిటీ భక్తుల కొరకు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నారు

## వర్షకొండ ఈద్ గా మినార్ లను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ముస్లిం మత పెద్దలు డిఎస్పి కి ఫిర్యాదు




**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి క్రైమ్ ప్రతినిధి డిసెంబరు 15:** ఈద్ గా మినార్ లను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముస్లిం మత పెద్దలు ఆదివారం డిఎస్పి ఏ. రాములు కు కి ఫిర్యాదు చేసారు. వివరాల్లోకి వెళితే ఇబ్రహీంపట్నం మండలం వర్ష కొండ గ్రామంలో గల ఈద్ గా మినార్ లను ఎవరో గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారని వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివారం ముస్లిం మత పెద్దలు డీఎస్పీ రాములు కు ఫిర్యాదు చేశారు. నిందితులు ఎంతటి వారైనా సరే వారిని పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని, మినార్ లను ధ్వంసం చేయడం వల్ల ముస్లింల మనోభావాలు దెబ్బతిన్నాయని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఎవరైతే ధ్వంసం చేసారో వారిని పట్టుకుని వారిని చట్ట పరంగా శిక్షించాలని ముస్లిం మత పెద్దలు అన్నారు.
ఈ కార్యక్రమంలో ఇబ్రహీం పట్నం మండల ముస్లిం మైనార్టీ నాయకులు ఎండి హుస్సేన్ ఖాన్, షేక్ ఖాదర్, మహమ్మద్ సదుల్లా మత పెద్దలు మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాగోజిపేట దొంగ మల్లన్న జాతరలో బోనమెత్తిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





**షణ్ముఖ వెలుగు మేడిపల్లి ప్రతినిధి డిసెంబరు 15:** భీమారం మండలం రాగోజిపేట గ్రామంలో శ్రీ దొంగ మల్లన్న స్వామి వారి జాతర మహోత్సవంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం పాల్గొన్నారు ఆలయ అర్చకులు డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి స్వయాన ప్రభుత్వ విప్ బోన మెత్తి బోనాన్ని సమర్పించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ. ఆ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నానని తెలిపారు

## అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుంది

- మన ఊరు-మన కాంగ్రెస్ కార్యక్రమం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి.
- ఆర్భాటాల కోసం తప్ప కౌశిక్ రెడ్డి చేసింది ఏమి లేదు.
- ఎమ్మెల్సీ,ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలు తీర్చడంలో విఫలం.




**షణ్ముఖ వెలుగు జమ్మికుంట ప్రతినిధి డిసెంబరు 15 :** ప్రజా ప్రభుత్వంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని,గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు మన ఊరు-మన కాంగ్రెస్ కార్యక్రమం విజయవంతం కొనసాగుతుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ఆదివారం కమలాపూర్ మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో ఆయన ఇంటి ఇంటికి వెళ్లి తొమ్మిది లక్షల ముప్పై ఎనిమిది వేల విలువ చేసే సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం కన్నూరు గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే రైతులకు రుణ మాఫీ , బోనస్ ఇచ్చి రైతులను ఆదుకున్నామని కమలాపూర్ మండల అభివృద్ధికి నిధులు కేటాయించామని ఎస్డిఎఫ్ నిధులతో అంతర్గత సీసీ రోడ్లు ,డ్రైనేజీ వ్యవస్థకు కేటాయించామని అన్నారు. ప్రభుత్వ దవాఖానలో సౌకర్యాల కోసం కృషి చేస్తున్నామని,ఇప్పటికే నిధులు కేటాయించామని అన్నారు. కౌశిక్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకో అల్లు అర్జున్ కేసు విషయంలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని,థియేటర్ దగ్గర మహిళ మరణించినప్పుడు స్పందించని కౌశిక్ రెడ్డి ఇప్పుడు స్పందించడం విడ్డూరంగా ఉందని,పబ్లిసిటీ స్టంట్ కోసమే కౌశిక్ రెడ్డి డ్రామాలని, అందుకే లేని పోని అపోహలు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రణవ్ బాబు అన్నారు.
హుజురాబాద్ లో తన ఉనికి కోసం ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని,దీనిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి ఆయనకు లేదని మండిపడ్డారు.ఇలాంటి చిల్లర ఆరోపణలతో రాజకీయ పబ్బం గడుపుకునే కౌశిక్ రెడ్డికి ప్రజలే తగిన సమయంలో తగిన విధంగా బుద్ధి చెప్తారని అన్నారు.

## బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

- భారతీయులకు అంబేద్కర్ ప్రసాదించిన వరం రాజ్యాంగం
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య




**షణ్ముఖ వెలుగు సిటీ ప్రతినిధి డిసెంబరు 15:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 304 వ ఆదివారం జ్ఞాన మాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలకు రాజ్యాంగాన్ని ప్రసాదించడం వల్లనే నేడు స్వతంత్ర భారతావనిలో ప్రతి ఒక్కరికి సమానమైన హక్కులు కల్పించబడ్డాయని, కుల మతాల కతీతంగా ప్రతి ఒక్కరు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాల కోసం ఆకాంక్షల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సమితి యూత్ జనరల్ సెక్రటరీ కనకరాజు గౌడ్, రాపోలు శ్రీరాములు,గరుగుల యాకయ్య, యేసు రాజు, నవీన్,మందారం త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లా ఆణిముత్యం బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ దాసరి శ్రీనాథ్ గౌడ్

**షణ్ముఖ వెలుగు కేతన పెల్లి మున్సిపాలిటీ ప్రతినిధి డిసెంబరు 15:** దృఢ సంకల్పం ఉంటే సాధించలేనిది ఏది వుండదనడానికి ప్రముఖ బహుముఖ ప్రజ్ఞాశాలి డా.దాసరి శ్రీనాథ్ గౌడ్ ఒక చక్కని ఉదాహరణ మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం తిమ్మాపూర్ గ్రామ పరిధిలోని ఆర్.ఆర్.నగర్ నివాసి డాక్టర్ దాసరి శ్రీనాథ్ గౌడ్ బాల్యం నుండి మిమిక్రి కళాకారులుగా ప్రారంభమైన కళా జీవన ప్రయాణం ఒక దశలో జానపద గాయకులు గా,వాయిద్య కళాకారులుగా మలుపు తిరిగి ఆతదనంతరం అనూహ్యమైన మలుపు తిరిగి సాహిత్య దిశగా అడుగులు వేసింది.ఒక కళాకారుడిగా అలుపెరుగని 39 సంవత్సరాల సుదీర్ఘ కళా ప్రయాణంలో మిమిక్రి మరియు జానపద గాయకులు గా మండల,జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఇప్పటికి సుమారుగా 8600 పైచిలుకు ప్రదర్శనలిచ్చిన కళా అనుభవజ్ఞులు. ఇక 28 సంవత్సరాల తన సాహితీ ప్రస్థానంలో తెలుగు భాష లోని పద్య కవిత్వం,వచన కవిత్వం,భావ కవిత్వం, గేయాలు, ఏక పాత్రలు ,వ్యాసాలు వంటి పలు ప్రక్రియలతో సుమారు 30 గ్రంథాలకు పైగా రచించి వెలువరించిన మహాను భావులు.ఇక వీరి ప్రతిభా పాటవములను ప్రశంసిస్తూ జిల్లా స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు పలు సాహితీ కళా సంస్థల ద్వారా లెక్కకు మించిన సన్మానాలు,
సత్కారాలు విశిష్ట బహుమతులు ఉన్నతమైన, ప్రతిష్టాత్మకమైన పురస్కారాలు అనేక బిరుదులు,3 నంది అవార్డులు అందుకున్నారు. డాక్టర్ దాసరి శ్రీనాథ్ గౌడ్ తెలంగాణ మలి దశ ఉద్యమ సమయంలో ఒక కవిగా తెలంగాణ ఉద్యమ గీతాలు రచించి గాయకులు గా అనేక తెలంగాణ జెఏసి వేదికల పైన స్వయంగా ఆలపించి తెలంగాణ మలి దశ ఉద్యమంలో భాగస్వాములై తన వంతు బాధ్యతను నిర్వర్తించి తనకు జ్ఞాన భిక్ష పెట్టిన ప్రత్యక్ష గురువు తన కన్న తండ్రి అని,తన మొదటి ప్రేక్షకుడు,ప్రోత్సాహకులు కూడా తన కన్నతండ్రే నని ఈ సందర్భముగా హృదయపూర్వక కృతజ్ఞతా పూర్వక నమస్కారాలు సమర్పించారు. అదే విధంగా ఇప్పటి వరకు తాను రచించిన గ్రంథాలకు ముందు మాటలు వ్రాసి అనుగ్రహించిన ప్రముఖ సాహితీ స్వరూపులకు,ఆయా గ్రంథాలు ముద్రించడానికి ఆర్థిక సహాయం చేసిన దాతలకు కృతి స్వీకర్తలకు మరియు తన ప్రతిభా పాటవములను గుర్తించి గౌరవిస్తున్న పలు కళా సాహితీ సాంస్కృతిక సంస్థల నిర్వాహకులకు తన నిత్యజీవితంలో చేయూతనిచ్చి సహకరిస్తున్న ఆత్మీయ మిత్రులకు అవ్యాజమైన ప్రేమానురాగాలు అందిస్తున్న తన కుటుంబ సభ్యులకు తానెంతో ఋణపడి ఉంటానని అన్నారు.

**డాక్టర్ దాసరి శ్రీనాథ్ గౌడ్**

భవిష్యత్తులో అనేక రచనలు చేయాలని ఆకాంక్షిస్తూ కవిగా కళాకారులుగా అత్యున్నత శిఖరాన్ని అధిరోహించి జాతీయ అంతర్జాతీయ స్థాయి పెక్కు ప్రతిష్టాత్మక బహుమతులు సన్మాన సత్కారాలు పొందాలని ఆకాంక్షిస్తూ సదా వీరికి వీరి కుటుంబానికి భగవంతుని ఆశీస్సులుండాలని, వీరు



చేయుచున్న సాహిత్య రచనా యజ్ఞానికి ప్రభుత్వ సహాయ సహకార ప్రోత్సాహంతో పాటు
హితులు సన్నిహితులు శ్రేయోభిలాషులు కూడా సహృదయంతో ఆదరించి హితోధిక సహాయ సహకారాలు అందించి ప్రోత్సహించాలని కోరుతున్నారు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ ల సత్తా చాటుదాం

బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ సాగర్



షణ్ముఖ వెలుగు,వనపర్తి జిల్లా ప్రతినిధి, డిసెంబరు 15 : త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు తమ సత్తా చాటి అత్యధిక స్థానాలు గెలవాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ సాగర్ అన్నారు. బీసీ సమాజ్ దేవరకద్ర కమిటీ ఆధ్వర్యంలో కౌకుంట్ల మండల కేంద్రంలో జరిగిన బీసీ కులాల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో శ్రీనివాస్ సాగర్ మాట్లాడుతూ మన ఓటు మనమే వేసుకొని స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్తులో జరుగబోయే ఎమ్మెల్యే ఎంపీ స్థానాల్లో మనమే కీలకం కావాలని,బీసీ విద్యార్థులను నిరుద్యోగులుగా మార్చుతున్న ఈడబ్ల్యూఎస్,జీవో 29 లను రద్దు చేయాలని ఆయను కోరారు.దేవరకద్ర నియోజకవర్గంలో అత్యధికంగా బీసీ లు ఉన్నారు కాబట్టి భవిష్యత్తులో దేవరకద్ర ఎమ్మెల్యే గా బీసీలే గెలుపొందుతారని శ్రీనివాస్ సాగర్ అన్నారు. బీసీ నాయకుడు గొల్ల ఆంజనేయులు మాట్లాడుతూ చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ లు అందరూ ఐకమత్యంతో పోరాడి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని కోరారు.హాజరైన వివిధ కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ బీసీ ,ఎస్సీ ఎస్టీ, మైనారిటీ లు అందరూ కలిసి కట్టుగా ముందుకు వెళ్తూ ఏ ఎన్నికలు వచ్చినా తమ వారే విజయం సాధించే దిశగా అడుగులు వేద్దామని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ దేవరకద్ర కన్వీనర్ బి.శేఖర్, బీసీ సమాజ్ భూత్పూర్ మండల కన్వీనర్ ఆంజనేయులు, జహంగీర్, గోపాల్ సాగర్, మాజీ ఎంపీటీసీ కిష్టన్న, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రావు, చందు గౌడ్, కావలి శేఖర్, ఉల్లి నరేష్,బజారు శ్రీనివాసులు,
కథలయ్య, ఇస్రంపల్లి యాదయ్య, పేరూరు ఖలీల్,రాజోలి రాములు, ముచ్చింతల శ్రీనివాస్ యాదవ్, శాలివాహన సంఘం మండల అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి పేట లో నాటి చిరు వైద్యశాల

# అయింది నేడు అశ్విని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

ఊహకు వచ్చింది నిజం చేసి చూపిన వైద్యుడు
ఉత్తర తెలంగాణ జిల్లాలోనే
ప్రత్యేక ఆసుపత్రి గా నిలిచిన ఎల్లారెడ్డి పేటలోని అశ్విని ఆసుపత్రి పై షణ్ముఖ వెలుగు స్పెషల్ స్టోరీ

**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట ప్రతినిధి డిసెంబరు 15:** వైద్యో నారాయణో హరి అని వైద్యులకు వర్తించే సూక్తిని నిజం చేసి చూపుతున్నారు ఎల్లారెడ్డి పేట మండల కేంద్రానికి చెందిన అశ్విని ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ సత్యనారాయణ స్వామి మారుమూల గిరిజన మండలం గా పేరున్న నేటి ఉమ్మడి ఎల్లారెడ్డి పేట మండలంలోని పదిర గ్రామానికి చెందిన గోవర్ధన గిరి సత్యనారాయణ స్వామి ఎంబిబిఎస్ పూర్తి చేసి తన ప్రాంతంలోనే ఆసుపత్రి ఏర్పాటుతో ప్రజలకు వైద్యం అందించాలని నిర్ణయించారు. మొట్ట మొదట రాచర్ల బోప్పా పూర్ గ్రామంలో1979 జూన్ 3 న అద్దె ఇంటిలో క్లినిక్ పెట్టుకొని గ్రామ ప్రజలకు వైద్యం చేస్తూ వచ్చారు.

అనంతరం తన ఆసుపత్రిని మండల కేంద్రం అయిన ఎల్లారెడ్డి పేటకు 1979 సెప్టెంబర్ 26 న మార్చారు. ఎల్లారెడ్డి పేట కిషన్ దాస్ పేటల మధ్యన అశ్విని నర్సింగ్ హెూం పేరున ఆసుపత్రి ఏర్పాటు చేసి అనేక ఏళ్ల పాటు ఎల్లారెడ్డి పేట ,ప్రస్తుత వీర్ణపల్లి మండలాలతో పాటు గంభీరావు పేట మండలాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ వచ్చారు. ఉత్తమమైన వైద్యం అందించడంతో డాక్టర్ సత్యనారాయణ స్వామికి మంచి పేరు వచ్చింది.

ఆసుపత్రికి రోగుల సంఖ్య పెరిగింది. ఆనాడు డాక్టర్ సత్యనారాయణ స్వామికి ఆలోచన వచ్చింది.

తన ఆసుపత్రిని ఉత్తర తెలంగాణ లోనే ప్రముఖ వైద్యశాల గా మార్చాలని ఆలోచించారు.ఆ ఆలోచన ఊహించడానికే అబ్బో అని అనిపించినా ఆ ఆలోచనను ఆచరణలో పెట్టాలని నిర్ణయించారు. ముందుగా స్వంతంగా ఆసుపత్రిని నిర్మించాలని భావించారు. ఆ ఆసుపత్రి సిరిసిల్ల కామారెడ్డి ప్రధాన రహదారికి ప్రక్కనే వుండాలని భావించారు.

ఆయన ఆలోచనను క్రమంగా అమలు చేస్తూ మొదట ఎల్లారెడ్డి పేట కొత్త బస్టాండ్ ఎదురుగా ఆసుపత్రికి స్థలం కొనుగోలు చేసి అశ్విని ఆసుపత్రి నిర్మాణం ప్రారంభించారు.

ఆ ఆసుపత్రి రెండు అంతస్తుల్లో నిర్మాణం పూర్తి చేసి 2001 ఏప్రిల్ 18 న అశ్విని ఆసుపత్రిని స్వంత భవనం లోకి మార్చారు. అధిక పెట్టుబడి అవుతున్నా వెనుకడుగు వేయకుండా ఆసుపత్రిని అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసి వైద్యం అందిస్తూ వచ్చారు. తన ఆసుపత్రిలో



పాము కాటుకు గురైన వారిని, పురుగుల మందు త్రాగిన వారిని కాపాడుటకు ఏ జిల్లాలలో లేని వెంటి లెటర్ సౌకర్యాన్ని మొట్ట మొదట ఏర్పాటు చేసి ఎందరి ప్రాణాలు కాపాడారు. ఉత్తర తెలంగాణ జిల్లాలోనే ఏ ఆసుపత్రిలో లేని వెంటి లెటర్ సదుపాయం అశ్విని ఆసుపత్రిలో కల్పించడం తో అశ్విని ఆసుపత్రికి పెద్ద ఆసుపత్రి అన్న పేరు వచ్చింది.

అంతటితో ఆగకుండా తన ఆసుపత్రిలో అనేక నిర్మాణాలు చేపట్టి అన్ని రకాల వైద్య పరికరాలు, కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాలు కల్పించి అధునాతన వైద్యం అందించే స్థాయికి తన ఆసుపత్రిని తీసుకు వచ్చారు డాక్టర్ సత్యనారాయణ స్వామి. ప్రస్తుతం ఆ అశ్విని ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి గా మారింది. అనేక జిల్లాల ప్రజలకు ఉత్తమ వైద్యం అందించే స్థాయికి ఎదిగింది. అశ్విని ఆసుపత్రి లో శుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఆ ఆసుపత్రికి చాలా నీట్ ఆసుపత్రి అన్న పేరు కూడా వుంది. అశ్విని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రస్తుతం 12 మంది డాక్టర్లు పనిచేస్తున్నారు. వివిధ రోగాలకు ఇక్కడ డాక్టర్లు వైద్యం అందిస్తున్నారు.

ఆసుపత్రిలో మొత్తం 110 మంది నాన్ మెడికల్ సిబ్బంది వర్కర్లు పనిచేస్తున్నారు. ఆసుపత్రిలో ప్రస్తుతం ఫుల్ టైం గా వున్న న్యూరో ఫీజిషియన్, పిడియాట్రీషి యాన్ ఆర్తో డాక్టర్లతో పాటు స్త్రీ వ్యాధి నిపుణులు,అనేక మంది స్పెషలిస్ట్ డాక్టర్ లు పూర్తి స్థాయిలో వైద్యం అందిస్తున్నారు. రానున్న కొద్ది రోజుల్లో ఆసుపత్రిలో కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలాజి, యురాలాజీ డాక్టర్లు రెసిడెంట్ డాక్టర్లు గా వైద్యం చేయుటకు రానున్నారు.

అశ్విని ఆసుపత్రి లో వ్యవస్థాపకులు డాక్టర్ సత్యనారాయణ స్వామి తో పాటు ఆయన కుమారుడు అభినయ్ కూడా డాక్టర్ గా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టి ఆసుపత్రిని గొప్పగా నిర్వహిస్తున్నారు.



అశ్విని ఆసుపత్రి కేవలం వైద్యం అందించే ఆసుపత్రి మాత్రమే కాదు ఎందరో యువకులను ఆర్ఎంపి డాక్టర్ లుగా మార్చి వారి జీవన స్థితి గతులను ,తల రాతలను మార్చిన కర్మాగారం కూడా.



అశ్విని ఆసుపత్రి ద్వారా పల్లెల్లో అనేక ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం, ఉచితంగా మందులు పంపిణీ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ సత్యనారాయణ స్వామి దంపతులు పలు విధాల ఆధ్యాత్మిక సేవలకు ,ఆలయ వేడుకలకు సహకారం అందించే గొప్ప మనసున్న మానవతా వాదులుగా పేరు గాంచారు. కేవలం వైద్యం అందించడం ద్వారానే తన కుటుంబ జీవనం సాగించడం కాదు అని ఎందరికో ఉపాధిని అందించాలని,సమాజ సేవకు తనవంతు సహకారం అందించాలని భావించే డాక్టర్ సత్యనారాయణ స్వామి తాను ఏనాడో కన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కలని ఎన్నో ఒడుదొడుకులు వచ్చినా మొక్కవోని ధైర్యం,

పట్టుదలతో ముందుకు సాగుతూ సాధారణ అశ్విని ఆసుపత్రిని నేడు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి గా నిల బెట్టారంటే డాక్టర్ సత్యనారాయణ స్వామి కష్టం, కృషి ఎంతుందో చెప్పనలవి కాదు.


అందుకే డాక్టర్ సత్యనారాయణ స్వామికి షణ్ముఖ వెలుగు అందిస్తుంది అభినందన సుమాంజలులు

# జమిలి ఎన్నికల బిల్లుపై వెనక్కి తగ్గిన కేంద్రం

**న్యూఢిల్లీ :** ఒకే దేశం-ఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు తెలుస్తున్నది. వాస్తవానికి, సోమవారం పార్లమెంట్‌లో బిల్లులు ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ క్రమంలో రాజ్యాంగం (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంత చట్టాల (సవరణ) బిల్లులను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు జాబితా చేసింది. తాజాగా సవరించిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో సోమవారం నాటి ఎజెండాలో ఈ రెండు బిల్లులను తొలగించింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 20న ముగియనున్నారు. గురువారం కేబినెట్ రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు- 2024, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ బిల్లు), 2024కి ఆమోద ముద్ర వేసింది.

ఆ తర్వాత శుక్రవారం సాయంత్రం బిల్లులకు సంబంధించిన ప్రతులను సభ్యులకు పంపిణీ పూర్తయ్యింది. ఈ క్రమంలో కేంద్రం బిల్లులను ప్రవేశపెడుతుందా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి జమిలీ ఎన్నికల కోసం రాజ్యాంగంలో కొత్తగా 82ఎ అధికరణను చేర్చాల్సి రానున్నది. పార్లమెంట్ పదవీకాలంలో మార్పు కోసం 83 అధికరణ, అసెంబ్లీ పదవీకాలం సవరణ కోసం 327 అధికరణను సవరించాల్సి ఉంటుంది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ సిఫారసుల మేరకు రాజ్యాంగ (129వ సవరణ) బిల్లును కేంద్రం రూపొందించిన విషయం తెలిసిందే. ముసాయిదా బిల్లుల ప్రకారం సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ మొదటి సమావేశానికి రాష్ట్రపతి నోటిఫై చేసిన తేదీ నుంచి ఏకకాల ఎన్నికలు అమలులోకి వస్తాయి.

రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం.. ఈ నియమిత తేదీ తర్వాత ఎన్నికైన అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలాలు, లోక్‌సభ పూర్తికాల వ్యవధితో పాటు ముగిసేలా తగ్గిస్తారు. తద్వారా ఏకకాల ఎన్నికలకు మార్గం సుగమమవుతుంది. 2024 లోక్‌సభకు సంబంధించి మొదటి సమావేశం ముగిసిందున.. తదుపరి లోక్‌సభ ఎన్నికలు 2029లో జరుగుతాయి. ఆ లోక్‌సభ తొలి సమావేశంలో రాష్ట్రపతి నోటిఫై చేస్తే.. ఆ లోక్‌సభ పూర్తి పదవీ కాలం ఉంటే 2034లో తొలి విడత జమిలీ ఎన్నికలు జరుగుతాయి. బిల్లు ప్రకారం అసెంబ్లీలకు ఉన్న నిబంధనలు కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, జమ్మూ కశ్మీర్, పుదుచ్చేరికి వర్తిస్తాయి. కొత్త



జమిలి ఎన్నికల బిల్లు ప్రకారం నిర్దేశిత కాల పరిమితి కన్నా ముందే పార్లమెంట్, రాష్ట్ర, యూటీల అసెంబ్లీలు రద్దయితే, ఆయా అసెంబ్లీలకు, పార్లమెంట్‌కు మిగిలి ఉన్న కాలానికి మాత్రమే మధ్యంతర ఎన్నికలు జరుగుతాయి.

**డిసెంబర్ 16న..**

నవంబర్ 25వ తేదీన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైనాయి. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికల బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేందుకు మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. లోక్‌సభ ముందుకు ఈ బిల్లును సోమవారం అంటే డిసెంబర్ 16వ తేదీ తీసుకు వచ్చేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. ఆ క్రమంలో లోక్‌సభ బిజినెస్‌లో సైతం దీనిని పొందు పరిచింది.

**కేంద్ర మంత్రులు సైతం..**

ఈ బిల్లుతో పాటు మరో బిల్లును కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘవాల్ సభలో ప్రవేశపెడతారని ఇప్పటికే కేంద్రం సైతం ఓ స్పష్టమైన ప్రకటన చేసింది. అయితే లోక్‌సభలో బిజినెస్ జాబితా నుంచి ఈ రెండు బిల్లులను తొలగించింది. రివైజ్ చేసిన లోకసభ బిజినెస్‌లో జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లులు లేవు. ఈ సమావేశాల్లోనే జమిలి బిల్లులు పార్లమెంటు ముందుకు తీసుకురానున్నట్లు పలువురు కేంద్ర మంత్రులు ఇప్పటికే ప్రకటించారు. అలాంటి వేళ.. ఈ బిల్లు ఆమోదింప చేసుకొనేందుకు మోదీ ప్రభుత్వం సందిగ్ధంలో పడడంపై సర్వత్ర సందేహాలు వ్యక్తమవుతోన్నాయి.

**ఎందుకంటే..**

సార్వత్రిక ఎన్నికలతో పాటు అన్ని రాష్ట్రాలకు ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుంది. అందుకోసం జమిలి ఎన్నికల నిర్వహించాలని భావిస్తోంది. ఎందుకంటే.. ప్రతి ఏటా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఎక్కడో అక్కడ..ఎప్పుడో అప్పుడు ఎన్నికలు లేదా ఉప ఎన్నికలు జరుగుతునే ఉంటాయి. దీంతో ఎన్నికల కోడ్ అమల్లో ఉండడం.. అలాగే వివిధ రాష్ట్రాల్లో అధికార యంత్రాంగం అంతా ఆయా ఎన్నికల క్రతువులో పాల్గొంటున్నాయి.

**ఆ సమస్యల నుంచి..**

దాంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతోన్నాయి. ఈ తరహా సమస్యల నుంచి బయట పడేందుకు జమిలి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుంది. అందుకోసం ఈ బిల్లును ఆమోదింప చేసుకొనేందుకు ప్రయత్నం చేస్తుంది. అలాంటి వేళ.. ఇలా చివరి నిమిషంలో మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గడం పట్ల పలు సందేహాలకు తావిస్తోంది.

## సింగిరెడ్డి పద్మారెడ్డిని పరామర్శించిన టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

- కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపిన సింగిరెడ్డి పద్మా రెడ్డి





**షణ్ముఖ వెలుగు సిటీ ప్రతినిధి డిసెంబరు 15:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఐదవ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి గత నెలలో లిఫ్ట్ ప్రమాదంలో గాయపడిన నేపథ్యంలో సింగిరెడ్డి పద్మా రెడ్డిని టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, టి పిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలి పెద్ది సుధీర్ రెడ్డి, పిర్జాది గూడ మేయర్ అమర్ సింగ్ డిప్యూటీ మేయర్ కొత్త రవి గౌడ్,స్రవంతి కిషోర్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ లు పలువురు నాయకులు సింగిరెడ్డి పద్మా రెడ్డిని పరామర్శించారు.

త్వరగా కోలుకొని ప్రజాసేవ కార్యక్రమాలలో పాల్గొనాలని పలువురు కాంగ్రెస్ నేతలు ఆకాంక్షించారు. తనపై ప్రేమాభిమానాలతో పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు శ్రేయోభిలాషులకు సింగిరెడ్డి పద్మా రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

## ఢిల్లీ ఎన్నికల కోసం ఆప్ తుది జాబితా.. న్యూఢిల్లీ నుంచి అరవింద్ కేజ్రీవాల్ పోటీ

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం నాలుగో జాబితా విడుదల చేసింది. తుది జాబితాలో 38 మంది అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. ఆప్ చీఫ్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న న్యూఢిల్లీ సీటు నుంచి అలాగే కల్కాజీ నుంచి సీఎం అతిషి పోటీ చేయనున్నారు. గ్రేటర్ కైలాష్ నుంచి మంత్రి సౌరభ్ భరద్వాజ్, బాబర్‌పూర్ నుంచి గోపాల్ రాయ్ బరిలోకి దిగుతున్నారు. శకుర్ బస్తీ నుంచి సత్యేంద్ర కుమార్ జైన్, రాజిందర్ నగర్ నుంచి దుర్గేష్ పాఠక్ పోటీ చేయనున్నారు. కాగా, తుది జాబితా ప్రకటనతో ఢిల్లీ అసెంబ్లీలోని మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ఆప్ ఖరారు చేసింది. తమ పార్టీ పూర్తి విశ్వాసంతో, సన్నాహాలతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తుందని అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. 'బీజేపీ కనిపించదు. సీఎం ఫేస్ వ్యక్తి, బృందం, ప్రణాళిక, ఢిల్లీపై దృష్టి వారికి లేదు. వారికి ఒకే ఒక్క నినాదం ఉంది. 'కేజ్రీవాల్‌ను తొలగించండి'. ఈ ఐదేళ్లలో ఏమి చేశారో వారిని అడగండి. 'కేజ్రీవాల్‌ను మేం దుర్భాషలాడాం' అని చెబుతారు' అని విమర్శించారు. మరోవైపు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు. 2025 ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'ప్రజాకోర్టు' తీర్పు తర్వాత మాత్రమే తిరిగి ఆ పదవి చేపడతానని అన్నారు. అలాగే కాంగ్రెస్‌తో ముందస్తు ఎన్నికల పొత్తుకు అవకాశం లేదని తేల్చిచెప్పారు. సొంత బలంతోనే తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

## ఈవీఎంలపై విశ్వాసం లేకుంటే...

**న్యూఢిల్లీ:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై కాంగ్రెస్ అభ్యంతరాలను జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తోసిపుచ్చాడు. 'ఇండియా' కూటమిలో ఒమర్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ భాగస్వామిగా ఉండటంతో పాటు కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌సీ-కాంగ్రెస్ కలిసి పోటీ చేశాయి. కాంగ్రెస్ పార్టీ తరచు ఈవీఎంలపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పాటు బ్యాలెట్ ఎన్నికలకు డిమాండ్ చేస్తోంది. హర్యానా, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఈవీఎంల వినియోగంపై మరింత దాడి చేసింది. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా పీటీఐకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. గెలిచినప్పుడు ఎన్నికల ఫలితాలను అంగీకరించినప్పుడు, ఓడిపోయినప్పుడు ఈవీఎంలను తప్పుపట్టరాదని అన్నారు. "ఇదే ఈవీఎంలతో వందకు పైగా ఎంపీలను గెలిచినప్పుడు పార్టీ విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు. ఆ తర్వాత కొద్దినెలలకే ఎన్నికలు ఫలితాలు మీ అంచనాలకు అనుగుణంగా రానప్పుడు ఈవీఎంలు మీకు నచ్చకుండా పోతున్నాయి" అని ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. ఓటింగ్ మిషన్లను విశ్వసించనప్పుడు ఎన్నికల్లో పోటీకి పార్టీలు దూరంగా ఉండాలన్నారు. బీజేపీ ప్రతినిధి తరహాలో మీ మాటలు ఉన్నాయని మీడియా అడిగినప్పుడు "అలాంటిదేమీ లేదు.. ఒప్పు ఎప్పుడూ ఒప్పే" అని ఆయన సమాధానమిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో తాను ఓడినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ఉదహరించారు. సిద్ధాంతాల పరంగానే కానీ పక్షపాతంతో తాను మాట్లాడటం లేదని, సెంట్రల్ విస్టా వంటి మౌలిక వసతుల ప్రాజెక్టుకు తాను సపోర్ట్ చేశానని విషయాన్ని గుర్తు చేసారు. ఢిల్లీలో సెంట్రల్ విస్టా ప్రాజెక్టు మంచిదేని, అలాగే కొత్త పార్లమెంటు భవనం నిర్మాణం చాలా మంచి ఆలోచన అని తాను నమ్ముతానని అన్నారు. పాత పార్లమెంటు భవనం మనుగడ కాలం తగ్గినందున కొత్త పార్లమెంటు భవనం అవసరం ఉందని చెప్పారు. జమ్మూ కశ్మీర్‌లో గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఫలితాలపై ఒమర్ అబ్దుల్లా అసంతృప్తితో ఉన్నారంటూ వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా తాజా వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచారంపై కాంగ్రెస్ పెద్దగా దృష్టి పెట్టకుండా తమపైనే ఎక్కువగా కాంగ్రెస్ ఆధారపడిందని పలువురు ఎన్‌సీ నేతలు సైతం వ్యాఖ్యానించారు. 90 మంది సభ్యుల జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో ఎన్‌సీ 42 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 6 సీట్లు దక్కించుకుంది

## భార్యతో కలిసి ఆప్‌లో చేరిన.. బీజేపీ నేత రమేష్ పెహల్వాన్

**న్యూఢిల్లీ:** బీజేపీ నేత రమేష్ పెహల్వాన్ తన భార్య కుసుమలతతో కలిసి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో ఆదివారం చేరారు. ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకుని సభ్యత్వం తీసుకున్నారు. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు ఆప్‌లో చేరారు. 2025 ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కొందరు పోటీలో ఉన్నారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం నాలుగో జాబితాను ఆప్ ఆదివారం విడుదల చేసింది. తుది జాబితాలో 38 మంది అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. ఆప్ చీఫ్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న న్యూఢిల్లీ సీటు నుంచి అలాగే కల్కాజీ నుంచి సీఎం అతిషి పోటీ చేయనున్నారు. తుది జాబితా ప్రకటనతో ఢిల్లీ అసెంబ్లీలోని మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ఆప్ ఖరారు చేసింది. మరోవైపు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com